సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం ၊ 8 ၊ అక్టోబర్ ၊ 2023



పర్యాటకంగా అభివృద్ధి
అటవీ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ వినోద్‌కుమార్ సింగ్ అన్నారు. 8లో



అన్నదాతకు అండగా ప్రభుత్వం
రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. 8లో



ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలని రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి సూచించారు. 9లో

న్యూస్‌రీల్

దుడుమ జలపాతం వద్ద రెస్టారెంట్ ప్రారంభం

● మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ



దుడుమలో రెస్టారెంట్ వద్ద మహిళలతో కోరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పడాల్

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా ఉమ్మడి మాచ్‌ఖండ్ జలవిద్యుత్ ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం దుడుమ జలపాతం వద్ద రెస్టారెంట్‌ను అందుబాటులోకి తెచ్చింది. శనివారం ఒడిశాలోని కోరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పడాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెస్టారెంట్‌కు ప్రభుత్వం రూ.20 లక్షలు వెచ్చించదన్నారు. నిర్వహణ బాధ్యతలు మిషన్ శక్తి ఆధ్వర్యంలో మహిళ స్వయం సహాయక సంఘాలకు అప్పగించినట్టు చెప్పారు. పర్యాటకులకు అనువుగా అన్నిరకాల ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

గుడిసలో రాత్రి బస నిషేధం

మారేడుమిల్లి : మండలంలోని పుల్లంగి పంచాయతీ పరిధిలో ప్రముఖ పర్యాటక ప్రదేశమైన గుడిస హిల్‌టాప్‌లో పర్యాటకులు రాత్రి బసను నిలిపివేస్తున్నట్టు స్థానిక అటవీ సంరక్షణ అధికారి సుమంత్ ఒక ప్రకటనలో తెలిపారు. గుడస ప్రాంతంలో గడ్డి భూములు, రక్షిత అటవీ ప్రాంతం, అటవీ జంతువులు స్వేచ్ఛ నిమిత్తం అక్కడ రాత్రి వేళల్లో బసను నిషేధిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అక్కడ వంటటం, ఫైర్ క్యాంపులు, మద్యపానాన్ని అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఈ సూచనలను అతిక్రమిస్తే జంతు సంరక్షణ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఘాట్‌లో నిలిచిన ఆర్టీసీ బస్సు

● రెండు గంటల పాటు స్తంభించిన రాకపోకలు



ఘాట్‌లోని కోమాలమ్మ మలుపు వద్ద నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

పాడేరు రూరల్ : పాడేరు–చోడవరం ప్రధాన రహదారి ఘాట్‌లోని కోమాలమ్మ పనుకు రెండో మలుపు వద్ద శనివారం సాయంత్రం సాంకేతిక సమస్య కారణంగా ఓ ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. విశాఖపట్నం నుంచి ప్రయాణికులతో పాడేరు వస్తున్న ఆర్టీసీ బస్సు ఘాట్‌లోని మలుపు వద్ద ఒక్కసారిగా వెనక్కి వచ్చి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో అందులో ఉన్న ప్రయాణికులు కంగారు పడ్డారు. వెంటనే బస్సులో ఉన్న ప్రయాణికులు కిందకి దిగిపోయారు. రెండు గంటల పాటు బస్సు ఘాట్‌లో రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. జీపు, కార్లు మినహా మిగిలిన బస్సులు, లారీలు, వ్యాన్లు వెళ్లేందుకు వీలుపడలేదు. ఆర్టీసీ గ్యారేజీ సిబ్బంది వచ్చి బస్సును పక్కకు తీయడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి. కండీషన్‌లో ఉండే ఆర్టీసీ బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రసవించిన కాసేపటికే..

● బాలింత మృతి



ఈశ్వరమ్మ (ఫైల్)

జి.మాడుగుల: మండలంలో కిల్లంకోట పంచాయతీ కోడిమామిడి గ్రామానికి చెందిన గర్భిణి టి.ఈశ్వరమ్మ విశాఖ కేజీహెచ్‌లో శనివారం ఆడశిశువుకు జన్మనిచ్చిన కొద్ది సేపటికి మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కోడిమామడి గ్రామానికి చెందిన గర్భిణి ఈశ్వరమ్మకు రెండు రోజుల క్రితం పురిటి నొప్పులు రావడంతో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు.అక్కడ శనివారం ఆడ శిశువుకు జన్మనిచ్చి ప్రాణాలు విడిచినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

చిరుధాన్యాలకు మద్దతు

జిల్లాలో గిరి రైతులు పండించే ఏ వ్యవసాయ ఉత్పత్తికైనా మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. ఎరువులు వినియోగించకుండా సేంద్రియ విధానంలో పండించడం వల్ల వినియోగదారులు పోటీపడి కొనుగోలు చేస్తుంటారు. ఈ ప్రాంతంలో పండించే చిరుధాన్యాలకు కూడా మంచి గిరాకీ ఉంది. సిఫార్సు చేసిన యాజమాన్య పద్ధతులను పాటిస్తే మరింత నాణ్యమైన దిగుబడులతోపాటు మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉందని వ్యవసాయశాఖ సూచిస్తోంది.



హుకుంపేట మండలం గడుగుపల్లి ప్రాంతంలో విరగ్గాసిన కంకులతో రాగుల పంట

- సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- 90 శాతం రాయితీపై విత్తనాలు
- అనుకూలించిన వాతావరణం
- కంకులతో పైరు కళకళ
- మార్కెట్లో మంచి ధర
- పెరుగుతున్న రాగులు, సామల సాగు విస్తీర్ణం

సాక్షి, పాడేరు: జిల్లాలో ఆహార పంటల్లో చిరుధాన్యాల సాగు ద్వారా గిరి రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. రాగులు, కొర్రలు, సామ పంటలను సేంద్రియ విధానంలో పండిస్తున్నారు. ఖరీఫ్‌లో పోడు, మెట్ట భూముల్లో ఆరుతడి పంటగా సాగు చేస్తున్నారు. ఈఏడాది సాగు ప్రారంభం నుంచి వర్షాలు కురుస్తుండటం వల్ల వాతావరణ పరిస్థితులు అనుకూలించాయి. ప్రస్తుతం పైరు కంకులతో కళకళలాడుతున్నాయి.

90 శాతం రాయితీపై విత్తనాలు

చిరుధాన్యాల సాగును రెండేళ్లుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. విత్తనాలను 90శాతం రాయితీపై గతేడాది ఖరీఫ్‌లో 97.35 క్వింటాళ్లు, ఈ ఏడాది 325 క్వింటాళ్లను ప్రభుత్వం సరఫరా చేసింది.

● 2022 ఖరీఫ్‌లో 13,977 హెక్టార్లలో రాగుల సాగు చేపట్టగా, ప్రస్తుత ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. 16,421 హెక్టార్లలో సాగు చేస్తున్నట్టు ఈక్రాప్‌లో నమోదైంది.

● గతేడాది కొర్రలు 31 హెక్టార్లలో మాత్రమే సాగు చేపట్టారు. ఈఏ దాది 110 హెక్టార్లలో వేశారు.

● గతేడాది సామలు 2205 హెక్టార్లలో సాగు చేపట్టగా ప్రస్తుత ఖరీఫ్‌లో 3,638 హెక్టార్లకు సాగు విస్తీర్ణం పెరిగింది.

రాగులకు మద్దతు ధర

రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్ల నుంచి రాగులకు మద్దతు ధర ప్రకటిస్తోంది. గత ఖరీఫ్‌లో కిలో ధర రూ.32 ప్రకటించింది. దీంతో వ్యాపారులు కూడా ధర పెంచి కొనుగోలు చేయడంతో గిరి రైతులకు మేలు చేకూరింది. ప్రభుత్వం ఈ ఏడాది కిలో రూ.38 చొప్పున మద్దతు ధరను ప్రకటించింది.

రాయితీతో ప్రయోజనం



రాయితీపై విత్తనాలు సరఫరా చేయడం వల్ల గిరి రైతులపై ఆర్థికభారం తప్పింది. సాగు విస్తీర్ణం పెరిగింది. ఈ ఏడాది ముందుగానే విత్తనాలను పంపిణీ చేయడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో పైరు కళకళలాడుతోంది. దిగుబడులు పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయశాఖ సిఫార్సు చేసిన యాజమాన్య పద్ధతులను పాటించి వాణిజ్యపరంగా సాగు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చు. – ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు



గింజలతో కంకి

బండారు క్షమాపణ చెప్పేవరకు పోరాటం



పాడేరు అంబేద్కర్ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, మహిళలు

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి హెచ్చరిక
- కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన

సాక్షి,పాడేరు: రాష్ట్ర మంత్రి రోజాపై అసభ్య పదజాలంతో దూషించిన టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి క్షమాపణ చెప్పేంత వరకు పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి హెచ్చరించారు. టీడీపీ నేత బండారు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం రాత్రి స్థానిక పాతబస్టాండ్ అంబేద్కర్ సెంటర్‌లో మహిళలతో కలిసి ఆమె కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. టీడీపీలో సీనియర్ నేతగా చెప్పుకునే బండారు రోజాకు, మహిళా సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల పట్ల గౌరవం లేకుండా అవమాన పరిచే విధంగా మాట్లాడిన బండారు సత్యనారాయణమూర్తిపై పోలీసు, న్యాయవ్యవస్థలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సినీ రంగ కళాకారులను అన్ని వర్గాల ప్రజలు గౌరవిస్తుండగా బండారు మాత్రం మంత్రి రోజాను చాలా అవమానకరంగా మాట్లాడడాన్ని మహిళా సమాజం అంతా తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ్లన్నదొర, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు, డైరెక్టర్ రామసత్యవతి, ఎంపీటీసీలు చల్లా చిట్టమ్మ, రామకృష్ణపాత్రుడు, కోడా సుశీల, ఐశ్వర్యరాణి, రాజారావు, సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

గొర్రగేదెకు పోస్టుమార్టం



గొర్రగేదె కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

మారేడుమిల్లి : వేటగాళ్ల దాడిలో గాయాపాలై లోయపడి మృతి చెందిన గొర్రగేదెకు శనివారం డీఎఫ్‌వో నరేంద్రన్ ఆధ్వర్యంలో పశువైద్యాధికారి వీరేంద్ర పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అటవీశాఖ సిబ్బంది ఖననం చేశారు. మారేడుమిల్లి రేంజ్ అధికారి అజిత్, వైల్డ్ లైఫ్ రేంజ్ అధికారి దుర్గ కుమార్, ఎస్ఎఫ్‌వో సుమంత్ వీఆర్వో రాజేశ్వరి, బీట్ అధికారి శివరెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం



వైఎస్సార్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

- పాడేరు, అరకు స్థానాలు గెలిపించి జగనన్నకు కానుకగా ఇద్దాం
- ఎమ్మెల్యే కుంభా రవిబాబు
- అరకులోయలో ఘన స్వాగతం

అరకులోయ టౌన్: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో అరకులోయ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి ముఖ్యమంత్రి జగనన్నకు కానుకగా ఇద్దామని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు అన్నారు. ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించి ప్రప్రథమంగా శనివారం అరకులోయ వచ్చిన ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవిబాబు మాట్లాడారు. పాడేరు ఏజెన్సీలో పార్టీ మరింత బలోపేతానికి అందరూ కృషి చేయాలని అన్నారు. గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి గిరిజన ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. గిరిజనుడికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం అదృష్టమన్నారు. అదివాసీల ప్రగతి లక్ష్యంగా సీఎం పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎంతోమంది కుటుంబాల్లో వెలుగులు నింపాయన్నారు. వైఎస్ హయాంలో 6.22 లక్షల మందికి పోడు పట్టాలు అందించగా, జగనన్న హయాంలో 3.26 లక్షల మంది గిరిరైతులకు పంపిణీ చేశారన్నారు. గిరిజన ప్రాంతంలో వైద్య కళాశాల, గిరిజన యూనివర్సిటీ, ఇంజినీరింగ్ యూనివర్సిటీ మంజూరు చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ఎన్నికైన రవిబాబు ఈ ప్రాంతంలో ఎమ్మెల్యేగా పనిచేసినందున ఈ ప్రాంత సమస్యలు ఆయనకు తెలుసునన్నారు. పూర్తి అవగాహనతో ఉన్నందున గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ఒక గిరిజనుడికి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన జగనన్నకు గిరిజన ప్రజల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. 2024లో అరకు, పాడేరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేసేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. అంతకు ముందు రవిబాబు ఫాంహౌస్ నుంచి వైఎస్ కాంస్య విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రావాలి జగన్.. కావాలి జగన్.. జై జగన్, జోహార్ వైఎస్సార్ నినాదాలతో అరకులోయ దద్దరిల్లింది. ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ నర్సింగరావు, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, జెడ్పీటీసీలు శెట్టి రోషిణి, రేగం మత్స్యలింగం, ఎస్టీ కమిషన్ సభ్యులు లిల్లీ, రామలక్ష్మి, ఎంపీపీలు రంజపల్లి ఉషారాణి పాల్గొన్నారు.



ర్యాలీలో రవిబాబుతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు


రవిబాబుకు ఘన స్వాగతం

అనంతగిరి : ఎమ్మెల్సీగా ఎన్నికై తొలిసారిగా మన్యం పర్యటనకు వచ్చిన డాక్టర్ కుంభా రవిబాబుకు ముఖద్వారం చిలకలగెడ్డ వద్ద మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన స్థానిక నేతలతో థింసా నృత్యం చేసి సందడి చేశారు. అనంతరం కొత్తమ్మ తల్లి గుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి , ఉమ్మడి విశాఖ పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎస్టీ కమిషన్ సభ్యులు జంపరంగి లిల్లీ, కొర్రా రామలక్ష్మి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేగబోయిన స్వామి, మాజీ అధ్యక్షుడు ఆనంద్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పాంగి అప్పారావు, ఎంపీటీసీలు మితుల, జయశ్రీ, కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనా వైస్ ఎంపీపీ జయవర్ధని తదితరులు ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి ఇంటర్ సర్టిఫికెట్ల పంపిణీ

విశాఖ విద్య: ఇంటర్ పరీక్షల్లో పాసైన విద్యార్థులకు ఆదివారం నుంచి ఒరిజనల్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు ఆర్‌ఐవో రాయల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చి, మే నెలల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజనల్ పాస్ మెమోలు విశాఖఆర్‌ఐవో కార్యాలయానికి వచ్చాయన్నారు. వీటిని తీసుకునేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాళ్లు ఆదివారం ఉదయం 10 గంటలకు రావాలన్నారు. ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రాలను ఇక నుంచి డిజిలాకర్‌లో ఉంటాయన్నారు. విద్యార్థులందరితో వారి మొబైల్ ఫోన్లలో డిజిలాకర్ యాప్ డౌన్‌లోడ్ చేయించాలన్నారు.

● వావ్.. వంజంగి



పర్యాటక ప్రాంతంగా విశ్వవ్యాప్తి పొందిన వంజంగి హిల్స్‌లో ప్రకృతి అందాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. వంజంగి హిల్స్‌లో శనివారం వేకువజామున పొగమంచు, సూర్యోదయం, శిఖరాలలో మేఘాల అందాలు అబ్బురపరిచాయి. వీటిని తిలకించేందుకు వచ్చిన పర్యాటకులతో ఉదయం 10 గంటల వరకు సందడి నెలకొంది. – సాక్షి, పాడేరు

జాతీయ యువజనోత్సవానికి గిరి యువత

- సీఆర్‌పీఎఫ్ అధికారి హరిహరన్
- చండీగఢ్‌కు 30 మంది యువకులు

గూడెంకొత్తవీధి: ఇతర ప్రాంతాల్లోని గిరిజనుల జీవన విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రాంతం నుంచి 30 మంది గిరిజన యువతీ యువకులను పంజాబ్‌లోని చండీగఢ్‌కు పంపిస్తున్నామని సీఆర్‌పీఎఫ్ 23 బెటాలియన్ జీ కంపెనీ ఇన్‌స్పెక్టర్ హరిహరన్ తెలిపారు. అక్కడికి వెళ్లనున్న గిరి యువతతో కలిసి శనివారం ఆయన మాట్లాడారు. అక్కడ నిర్వహించే 15వ జాతీయ గిరిజన యువజనోత్సవంలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి గిరిజనులు వస్తారన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఆయా గిరిజన ప్రాంతాలకు సంబంధించిన జీవన విధానాలు తెలుసుకుంటారన్నారు. వారి ఆచారాలు, సంస్కృతిని తెలియజేస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. దీంతోపాటు చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాలను వారికి చూపిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి, ఆర్ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



చండీగఢ్ వెళ్లే యువకులతో పోలీసులు

గంజాయి నిర్మూలనకు పకడ్బందీగా చర్యలు

- పరివర్తన-2లో 1,039.32 ఎకరాల్లో పంట ధ్వంసం
- ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు రూరల్ : జిల్లాలో 2022-23 సంవత్సరం పరివర్తన-2లో 1,039.32 ఎకరాల్లో సాగు చేస్తున్న గంజాయి పంటను ధ్వంసం చేసినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. పరివర్తన-1 కార్యక్రమం ద్వారా 2021-22లో 7,515.15 ఎకరాల్లో గంజాయి పంటను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. 2023-24లో కూడా పరివరన-3 కార్యక్రమం ద్వారా గంజాయిని నిర్మూలించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామాల్లో గంజాయి సాగు, అమ్మకాలు, రవాణ తదితర వివరాలను పాడేరు పోలీస్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్డీపీఎస్ విభాగం 9381123100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు అంత్యంత గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామాల్లో రైతులు తమ భూమిలో గంజాయి సాగు చేస్తుంటే ఆ వివరాలు తెలిసిన గ్రామస్థాయి అధికారులు సాగుకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వకుంటే ఎన్డీపీఎస్ చట్టం సెక్షన్ 32 ప్రకారం ఆరు నెలల జైలు శిక్ష, జరిమానా, కొన్ని సందర్భాల్లో రెండు కూడా విధిస్తామని హెచ్చరించారు. గంజాయి నిర్మూలనకు జిల్లా వ్యాప్తంగా నిరంతరం వాహనాల తనిఖీలు, ప్రత్యేక బృందాలతో నిఘా, ఎన్డీపీఎస్ విభాగం ఏర్పాటు తదితర చర్యలు తీసుకున్నామన్నారు. గంజాయి నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్పీ కోరారు.

పర్యాటకంగా అటవీ ప్రాంతాల అభివృద్ధి

- అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ వినోద్‌కుమార్‌సింగ్

చింతపల్లి: జిల్లాలోని చింతపల్లి, గూడెంకొత్తవీధి అటవీ ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ వినోద్‌కుమార్ సింగ్ అన్నారు. శనివారం ఆయన చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు మండలాల్లో అడవుల పరిక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. టేకు, పైన్ తోటల పెంపకానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట డీఎఫ్‌వోలు రవిశంకర్ శర్మ, సూర్యనారాయణ ఉన్నారు.

ఆరోగ్య ప్రదాత సీఎం జగన్



అనంతగిరిలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రవిబాబు



శిబిరంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

అనంతగిరి: ఆరోగ్య ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గిరిజనుల పాలిట వరంలా మారిందని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు అన్నారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ కేంద్రంలోని ఎంపీయూపీ పాఠశాలలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య సేవలు పొందేందుకు వచ్చిన గిరిజనులతో మమేకమై వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవిబాబు మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల ఆరోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధుల వారికి ఉన్నత వైద్యం అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా నిత్యం గ్రామాల్లో వైద్య సేవలందిస్తూ, కార్పొరేట్ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ, కొర్రా రామలక్ష్మి, ఎంపీపీ నీలవేణి, మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, ఎంపీటీసీ సభ్యురాలు మితుల, సర్పంచ్‌లు మజ్జి అప్పారావు, పాంగి అప్పారావు, నాయకుడు ఆనంద్ పాల్గొన్నారు.

పేదలకు ఉన్నత వైద్యం ప్రభుత్వ లక్ష్యం

సాక్షి, పాడేరు: ఏజెన్సీలోని పేద ప్రజలకు సత్వరమే మెరుగైన ఉన్నత వైద్యసేవలు లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.వంట్లమామిడి సచివాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం స్పెషలిస్టు వైద్యులతో వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా ఆరోగ్యశ్రీ ద్వారా ఉన్నత వైద్యసేవలు కల్పిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మందులను ఆమె పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పరిశీలించారు. తహసీల్దార్ త్రినాథనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రాంబాబు, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ సూరిబాబు, డైరెక్టర్ రామసత్యవతి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రాజారావు, సర్పంచ్‌లు రాంబాబు, మంగమ్మ, నీలకంఠం, ఎంపీటీసీలు ఈశ్వరరావు, మీనా, చిట్టమ్మ, రామకృష్ణపాత్రుడు, నాయకులు గంగరాజు, గోపి, ఈశ్వరరావు, కాంతమ్మ, చిట్టిబాబు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా

పాఠశాలల్లో నో స్కూల్ బ్యాగ్ డే



గంగవరం ఎంపీపీ స్కూల్‌లో చిన్నారులు





నో స్కూల్ బ్యాగ్ డేలో చిన్నారులు

గంగవరం : మండలంలో వివిధ ప్రాథమిక పాఠశాలల్లో నో స్కూల్ బ్యాగ్ డే నిర్వహించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, కాగితాలతో అట్టలతో బొమ్మలు, మట్టితో బొమ్మలు, అక్షరమాల తయారు చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. జిపిఎస్ నీలవరం, వేములోవ, గంగవరం, భయ్యనపల్లి ఎంపీపీ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో బాలబాలికలు ఉత్సాహంగా ఆట పాటలతో పాల్గొన్నారు. పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యత వెలుగు చూస్తుందని ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఎంలు శ్రీనివాసు, చిన్నారెడ్డి పద్మావతి, గణపతి ఆధ్వర్యంలో చిన్నారులు గీసిన బొమ్మలు , ఆకట్టుకున్నాయి.

పది ఆర్ఎంపీ క్లినిక్‌ల సీజ్



తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య, తహసీల్దార్ శ్రీధర్, వైద్యాధికారి ధనలక్ష్మి

వీఆర్ పురం : వీఆర్‌పురం, రేఖపల్లి గ్రామాల్లోని ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న పది క్లినిక్‌లను సీజ్ చేసినట్టు డిప్యూటీ డీఎంహెచ్‌వో పి.పుల్లయ్య తెలిపారు. ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న క్లినిక్‌లను తహసీల్దార్ ఎస్. శ్రీధర్, డాక్టర్ ధనలక్ష్మితో కలిసి శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. పుల్లయ్య మాట్లాడుతూ ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్టు తెలిపారు. అనధికారికంగా నిర్వహిస్తున్న క్లినిక్‌ల్లో పలురకాల మందులు, రిజిస్టర్లు స్వాధీనం చేసు కున్నట్టు తెలిపారు. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకూ క్లినిక్‌ల్లో ఎలాంటి చికిత్సలు చేయవద్దని ఆదేశాలు జారీ చేసి, వాటిని సీజ్ చేశామన్నారు.

వన్య ప్రాణుల రక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అటవీ సిబ్బంది

మోతుగూడెం: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని అటవీశాఖ అధికారులు అన్నారు. చింతూరు డీఎఫ్‌వో పుష్ప సౌజన్య ఆదేశాల మేరకు లక్కవరం అటవీక్షేత్రాధికారి వెంకట నానాజీ ఆధ్వర్యంలో జాతీయ వన్య ప్రాణుల వారోత్సవాల్లో భాగంగా చింతూరు అటవీ డివిజన్ పరిధిలోని లక్కవరం రేంజ్‌లో గల లక్కవరం సెక్షన్లోని తులసిపాక, లక్కవరం గ్రామాల్లో శనివారం అటవీశాఖ అధికారులు ర్యాలీ నిర్వహించారు. అటవీశాఖ అధికారులు ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. వన్య ప్రాణుల రక్షణ అందరి బాధ్యత అని, అడవులను రక్షిద్దాం వన్య ప్రాణులను కాపాడుకుందాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అడవులను కాపాడుకుంటూ అటవీ జంతువుల సంరక్షించాలన్నారు. అడవి జంతువులను వేటాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రకృతి యొక్క పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో వన్య ప్రాణులు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.అటవీ అధికారులు సరిత, కుమారి, అటవీ ట్రైబల్ హెల్పర్ దూలయ్య, హెచ్ఎం ఆదయ్య, ఉపాధ్యాయులు మల్లురెడ్డి, మురళి పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



వంట్లమామిడి ఆర్‌బీకే ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.వంట్లమామిడి గ్రామంలో నిర్మించిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు గ్రామ స్థాయిలోనే మేలుచేసేలా రైతు భరోసా కేంద్రాల వ్యవస్థను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. రైతు భరోసా సాయం అందించడంతో పాటు జిల్లాలోని గిరిజన రైతులకు 90శాతం రాయితీపై విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మండల ఇంజనీరింగ్ అధికారి బాబుప్రసాద్,మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, పాడేరు మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంగి సూరిబాబు, డైరెక్టర్ లకే రామసత్యవతి, మండల పార్టీ ఉపాధ్యక్షులు పసుపుల సత్యనారాయణ,గబ్బాడ రాజారావు, సర్పంచ్‌లు పాంగి రాంబాబు, కొర్రా మంగమ్మ, నీలకంఠం, ఎంపీటీసీలు తోకల ఈశ్వరరావు, దూసురు మీనా, చల్లా చిట్టమ్మ, లకే రామకృష్ణపాత్రుడు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



గిరిజన సంఘం నాయకులు పట్టుకున్న బియ్యం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజన సంఘ నాయకులు

ముంచంగిపుట్టు : పెదగూడ నుంచి శనివారం బొలేరో వాహనంలో 18 బస్తాల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్టు గిరిజన సంఘ నాయకుడు కొర్రా త్రినాథ్ తెలిపారు. బియ్యాన్ని రెవెన్యూ సిబ్బందికి అప్పగించామన్నారు. కార్డుదారులకు అందాల్సిన బియ్యం పక్కదారి పట్టడం దారుణమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఏ డిపో నుంచి అక్రమ రవాణా జరిగిందో విచారణ చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ నర్సమ్మ మాట్లాడుతూ బియ్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందని, వాహనం సీజ్ చేస్తామని తెలిపారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు నారాయణ, శ్రీను, లైకోన్ తదితరులు పాల్గొన్నారు.